క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



ఊయలసేవలో స్వామిఅమ్మవారలు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

అలరించిన హరికథ



హరికథా వినిపిస్తున్న భాగవతార్

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై కడప జిల్లా మైదుకూరుకు చెందిన యడవల్లి రమణయ్య భాగవతార్ వారి 'భూకైలాస్' హరికథాగానం ఆకట్టుకుంది. కార్యక్రమానికి తబల సహకారాన్ని వై.ప్రసాద్‌బాబు, హార్మోనియం సహకారాన్ని కె.వీరభద్రుడు అందించారు.

ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలి

నందికొట్కూరు: ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్, డిగ్రీలు చదివి ఉద్యోగ అవకాశాలు లేక ఆటోలు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులకు జీవనోపాధి చూపకుండా ఇష్టానుసారంగా పథకం అమలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం



మొక్కలు నాటుతున్న దృశ్యం

కొత్తపల్లి: మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ ప్రచారక్ రామారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోకవరం గ్రామంలోని భక్తకన్నప్ప గురుకుల ఆవాసంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు ప్రాణవాయును అందిస్తాయని, వర్షాలు కురవాలన్న, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నా మొక్కలే కీలకమన్నారు. విద్యార్థులు ప్రతిఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఆవాస కార్యదర్శి రఘురాములు, సభ్యులు వాసుదేవరెడ్డి, రామకృష్ణ, రమణ, మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

పైపులైన్ పనులను అడ్డుకున్న సబ్‌కాంట్రాక్టర్లు

నందికొట్కూరు: చేసిన పనులకు బిల్లులు ఇచ్చేంత వరకు పనులు చేయనిచ్చేది లేదని ముచ్చుమర్రి వద్ద పైప్‌లైన్ పనులు చేసిన సబ్ కాంట్రాక్టర్లు వెంకటేశ్వర్లు, రామకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం వారు పైప్‌లైన్ పనులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కాంట్రాక్టర్లు మాట్లాడుతూ ముచ్చుమర్రి నుంచి రెండు కిలోమీటర్ల వరకు పైపులైన్ పనులు చేసినా కాంట్రాక్టర్ కేఎల్‌ఎస్‌ఆర్ కంపెనీ యజమాని తమకు ఇంత వరకు బిల్లులు ఇవ్వకుండా సతాయిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల నుంచి హైదరాబాద్‌కు తిప్పుకుంటూ చివరకు చేతులు ఎత్తేయడంతో పనులను అడ్డుకున్నామన్నారు. సుమారు రూ.30 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



శ్రీశైలంలో మాట్లాడుతున్న దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు



ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న డీఎస్పీ రామాంజినాయక్, పోలీసులు



మహానంది దేవస్థానం కార్యాలయంలో జెండా ఆవిష్కరణ

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

మువ్వన్నెల జెండా వాడవాడలా రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయమే విద్యార్థులు తెల్లటి దుస్తులు ధరించి మూడురంగుల జెండాలను చేతబూని పాఠశాలలకు చేరుకున్నారు. జెండా వందనం తర్వాత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఎందరో స్వాతంత్య్ర సమరయోధుల త్యాగఫలమే స్వాతంత్య్రమని అతిథులు విద్యార్థులకు తెలియజేశారు. వారి అడుగుజాడల్లో యువత నడవాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



నందికొట్కూరు కోర్టు ఆవరణలో జెండావిష్కరణ చేస్తున్న జిల్లా జడ్జి లీలావతి

నందికొట్కూరు: స్థానిక కోర్టు, మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎక్సైజ్, వ్యవసాయ, విద్యాశాఖల కార్యాలయాల వద్ద ఆయా శాఖల అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో 4వ అదనపు జడ్జి లీలావతి, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్, సబ్‌జైల్ సూపరిడెంట్ రఘునాథరెడ్డి, ఏడీఏ గిరీష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ తిరుపాలమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించగా.. ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, వ్యవసాయాధికారిణి హేమలత, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారుఫ్, ఆర్టీసీ డిపో మేనేజర్ వినయ్‌కుమార్ తమ తమ కార్యాలయాల వద్ద మువ్వన్నెల జెండాలను ఎగురవేశారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్ మీర్ జాతీయ జెండాను ఎగురవేశారు.

● **బండి ఆత్మకూరు:** ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీఓ రామకృష్ణవేణి పాల్గొన్నారు.

● **శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానం పరిపాలన భవనంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీశైలం పోలీసు స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● **శ్రీశైలంప్రాజెక్టు:** ఐడీడీఏ కార్యాలయంలో పీఓ వెంకటశివకుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు.

● **మహానంది:** మహానంది దేవస్థానం కార్యాలయంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని జాతీయ జెండాను ఎగుర వేశారు. తహసీల్దార్ రమాదేవి, ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తమ కార్యాలయాల్లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు.

● **వెలుగోడు:** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లాలం రమేష్ త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేశారు. తహసీల్దార్ శ్రీనివాసగౌడు, ఎస్‌ఐ సురేష్, ఏఈ రవీంద్రనాయక్, ఎంఈఓ బ్రహ్మంనాయక్, ఏఓ స్వాతి, సర్పంచ్ వేల్పుల జయపాల్ తమ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు.



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి



నందికొట్కూరులో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న తహసీల్దార్ సుభద్రమ్మ



కేజీబీవీలో యోగాసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



పగిడ్యాలలో జెండా వందనం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సువర్ణమ్మ

కొత్తపల్లి: ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ కుసుమలత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. తహసీల్దార్ ఉమారాణి, ఏఎస్‌ఐ రామ్‌నాయక్, సీహెచ్‌ఓ మురళీకృష్ణ, వైద్యురాలు దీపానాగవేణి, ఏపీఎం పుల్లయ్య, నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఎంఈఓ నాగరాజు తమ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకున్నారు. కేజీబీవీలో ప్రిన్సిపాల్ కృష్ణాబాయి ఆధ్వర్యంలో విద్యార్థినుల పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పాములపాడు: తహసీల్దార్ సుభద్రమ్మ, ఎస్‌ఐ సురేష్‌బాబు, డాక్టర్లు నాగలక్ష్మి, సావిత్రమ్మ, లైబ్రేరియన్ క్రిష్ణారెడ్డి తమతమ కార్యాలయాల్లో స్వాతంత్య్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. జాతీయ జెండాలను ఆవిష్కరించి సంబరాలు చేసుకున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల ప్రదర్శనలు ఆటక్టుకున్నాయి. ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు బహుమతులు అందజేశారు.

పగిడ్యాల: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద వారు మువ్వెన్నల పతాకాన్ని ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శివరాముడు జెండాను ఎగురవేశారు.

జూపాడుబంగ్లా: తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీపీ సువర్ణమ్మ, సీఐ సుబ్రహ్మణ్యం, డాక్టర్ గంగాధర్, సొసైటీ సీఈఓ చంద్రశేఖర్‌గౌడ్, ఏపీఓ అంబమ్మ, ప్రిన్సిపాల్స్ సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ రమేష్ తమ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. కాగా మండల వ్యవసాయ కార్యాలయం వద్ద స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించకపోవడంతో పలువురు అవాక్కయ్యారు.



జూపాడుబంగ్లా: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి



కేజీబీవీలో పిరమిడ్ విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్థానిక అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. గణపతి పూజ, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు.

రమేష్ యాదవ్ పోరాటం స్ఫూర్తిదాయకం

మహానంది: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పోరాటం స్ఫూర్తిదాయకమని పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పుల్లయ్య యాదవ్ అన్నారు. ఇటీవల రమేష్ యాదవ్‌పై దాడి జరగడంతో ఆయనను శుక్రవారం పొద్దుటూరులో కలిసి పరామర్శించి వచ్చారు. ఈసందర్భంగా పుల్లయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్న రమేష్ యాదవ్‌పై దాడి జరగడం బాధాకరమన్నారు.

జోరుగా మద్యం విక్రయాలు

నందికొట్కూరు: స్వాతంత్ర దినోత్సవం రోజు కూడా మిడుతూరు మండల కేంద్రంలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. మండల కేంద్రంలో శుక్రవారం మద్యం షాపు తెరిచి, మద్యం విక్రయించడం చూసిన ప్రజలు అసహ్యించుకున్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారం పెంచుదాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్రిటెక్ సంస్థ సిబ్బంది

వెలుగోడు: సేంద్రియ ఎరువులతో భూసారాన్ని పెంచుదామని షణ్ముఖ ఆగ్రోటెక్ సంస్థ ఏపీ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ అధికారి హుస్సేన్ బాషా అన్నారు. శుక్రవారం వేల్పనూరు గ్రామంలో షణ్ముఖ ఆగ్రోటెక్ సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సదస్సులో మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.చైతన్య రెడ్డి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతోనే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

వర్షాలకు కూలిన వృక్షం



రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

శ్రీశైలంప్రాజెక్టు: సున్నిపెంటలోని సెంట్రల్ లొకాలిటీ ఎలిమెంటరీ పాఠశాల ఆవరణంలోని వృక్షం కూలిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వృక్షం కూలి ప్రహరీ సమీపంలోని హోటల్‌పై పడింది. కొమ్మలు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఈ ఘటనలో రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు హోటల్ యజమాని హుస్సేన్ తెలిపారు.

ఇన్‌చార్జ్‌ల పాలనతో ఇక్కట్లు

- వేధిస్తున్న పంచాయతీ కార్యదర్శుల కొరత
- పని ఒత్తిడితో ఇబ్బందుల్లో పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి: పల్లెలే పట్టణాలకు పట్టుగొమ్మలంటారు. అలాంటి పల్లెల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా మారింది. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు లేకపోవడం.. ఇన్‌చార్జ్‌లే దిక్కు కావడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మరోవైపు పని ఒత్తిడితో పంచాయతీ కార్యదర్శులు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

కొత్తపల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలు, 18 మజారా గ్రామాల్లో దాదాపు 35 వేల జనాభా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 12 మంది గ్రేడ్-3, ఇద్దరు గ్రేడ్-4, తొమ్మిది మంది పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించేవారు. వీరితోపాటు మరో ఇద్దరు గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు కూడా ఉంటూ సంక్షేమపథకాలు, గ్రామాల అభివృద్ధిలో తోడ్పాటు అందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతా సచివాలయాల్లో ప్రజాప్రాతిపదికన సిబ్బందిని తగ్గించింది. ఆ తర్వాత సాధారణ బదిలీల్లో కొందరు పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఏడుగురు పంచాయతీ కార్యదర్శులే 12 గ్రామపంచాయతీలకు పనిచేస్తున్నారు. ఇందులో ఇద్దరు మహిళా పంచాయతీ కార్యదర్శులు ప్రసూతి సెలవుల్లో ఉన్నారు. ప్రస్తుతం 12 పంచాయతీలకు ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. దీంతో ఉన్న కార్యదర్శులకు అదనంగా రెండు, మూడు పంచాయతీలు కేటాయించడంతో పనిభారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరవేయడం ఆలస్యమవుతోంది. గ్రామాల అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించే పంచాయతీ కార్యదర్శుల సంఖ్య తక్కువగా ఉండటంతో అభివృద్ధి కుంటుపడుతోంది. పారిశుధ్యం, నీటి సరఫరా, వీధిలైట్ల సమస్యలు గ్రామాలను వెంటాడుతున్నాయి.



మండల ఎంపీడీఓ కార్యాలయం

పనిభారం పెరిగింది



నేను కొత్తపల్లికి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నా. అలాగే గుమ్మడాపురం, వీరాపురం, గువ్వలకుంట్ల పంచాయతీకు కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నాను. దీంతో పని భారం పెరిగింది. నాలుగు గ్రామ పంచాయతీల సమస్యలు పరిష్కరించాలంటే కాస్త కష్టంగానే ఉంది. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శులను నియమించాలి.

– చిన్నస్వామి యాదవ్,
పంచాయతీ కార్యదర్శి, కొత్తపల్లి